# 7. ప్రమాదం

సంవత్సరంలోని మొట్టమొదటి వసంత వాయువులు ప్రారంభమైనప్పుడు నిద్రిస్తున్న భూమాత మేల్కొని ఒళ్ళు విరుచుకుని తన సౌందర్యాన్నంతటినీ ప్రదర్శించసాగుతుంది. చుట్టూవున్న గాలి వాసనే మారుతుంది. ఆ సుగంధం నీ ఊపిరితిత్తులకు, హృదయానికి తగిలినప్పుడు చెప్పలేని ఆనందమేదో కమ్ముకుంటుంది. ఎక్కడెక్కడికో నడవాలని, దారీతెన్నూ లేకుండా పరుగెత్తి వసంతశోభను ఆనందిద్దామనే పిచ్చికోరిక నన్ను నిద్రపోనివ్వదు. వసంతానికి ముందు చలికాలం కావటం వల్ల, మే నెలలోని ఈ వసంతం మత్తెక్కిస్తుంది.

వసంతంలోని ఒకనాటి ఉదయం నిద్ర మేల్కొన్నప్పటికి, ఇళ్ళ మీదనుంచి సూర్యుడు ప్రకాశంగా కనిపించాడు. కింద వీధిలోనుంచి ఆనందమయమైన సంగీతం వినిపిస్తోంది. హృదయం ఆనందంతో వేగంగా కొట్టుకోసాగింది. ఎక్కడికో దిక్కు తెలియకుండానే నడిచి వెళ్దామనే పిచ్చికోర్కె రేకెత్తింది.

దారిలో కనిపించిన ప్రతి వ్యక్తి పెదవుల మీదా చిరునవ్వు చిందులాడుతోంది. ప్రతి ఒక్కరూ అనిర్వచనీయమైన ఆనందసాగరంలో మునిగివున్నారా అనిపిస్తోంది. ప్రణయవాయువులు స్వేచ్ఛగా పట్టణంలో వీస్తున్నవి. ఉదయానే అలంకరించుకున్న యువతులు చిలిపి కళ్ళ వెనుక ఏదో సౌకుమార్యాన్ని దాచుకొని, హుందాగా నడిచిపోతున్నారు. ఈ దృశ్యానికి నా గుండె మరీ వేగంగా కొట్టుకుంది.

నాకు తెలియకుండానే సైనీ నదీతీరాన్ని జేరాను. నదికి దిగువనున్న అడివి ప్రదేశానికి బయలుదేరే చిన్న స్టీమర్లు సిద్ధంగా వున్నవి. అడివి ప్రదేశంలో నడవాలనే

కోర్కె నాలో కలిగింది. స్టీమరు టాపు మీద ప్రయాణీకులు కిక్కిరిసి వున్నారు. నిజమే! ఈ వసంతంలో ఎంత ప్రయత్నించినా ఇంట్లో ఉండటం కష్టం. ప్రయాణీకులు వెచ్చని సూర్యకిరణాల్ని అనుభవిస్తూ ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ ఎంతో ఆనందంగా వున్నారు.

మా ఇంటి పక్కన ఉన్న యువతి కూడా స్టీమర్ టాపు మీద ఉంది. ఆమె చిల్లరపనులేవో చేసుకుని బతుకుతూండేది. ఆమెలో ఈ బస్తీ నాజూకులు లేనప్పటికీ సహజ సౌందర్యం వుంది. ఆమె అందమైన చిన్నతలకాయ, ముంగురులు గాలిలో నాట్యం చేస్తూండగా కొత్త అందాన్ని చిలికే అందమైన ముఖం, చిలిపిగా పలకరించే కళ్ళు, ఆనందాన్ని చిందే పెదాలు నన్ను ఆకర్షించినవి. ఏమైనా కానీ ఈమెను ముద్దాడాలనే తీవ్రవాంఛ నన్ను వేధించింది.

తీవ్రమైన నా చూపులకు ఆమె తల కాస్తవొంచి నేలచూపులు చూసింది. కాని ఆమె దాయలేని చిరునవ్వు చెక్కిళ్ళలో గుంటలు చేసింది.

బయలుదేరబొయ్యే స్టీమరు మీదకు దూకాను. సూర్యుడు కొద్దికొద్దిగా ఎగబాకుతున్నాడు. పోయినకొద్దీ నది పెద్దదవసాగింది. వాతావరణమంతా నిశ్శబ్దంగా వున్నప్పటికీ జీవితం తాలూకు గుసగుసలతో నిండి వుందనేందుకు సందేహం లేకుండా వుంది.

ఆ పిల్ల తిరిగి తన కళ్ళను పైకెత్తింది. నేను తన వైపే చూస్తున్నట్లు గ్రహించి, పొరపాటుపడేందుకు వీల్లేకుండా చిరునవ్వు నవ్వింది. ఆమె సౌందర్యరాశి అనేందుకు సందేహం లేదు. ఆమె చిరునవ్వులో నాకు తెలియని లక్ష విషయాలు ఇట్టే తెలిసినట్లనిపించినయ్. ఆ చిరునవ్వులో అందని లోతులున్నవి. కవిత్వాన్ని గూర్చిన కలలోని సౌకుమార్యమంతా ఘనీభవించింది. లోకమంతా గాలిస్తూ సర్వశక్తులా ప్రయత్నించే ఆనందమంతా ఈ చిరునవ్వులోనే దొరికినట్లనిపించింది. ఆమెను రెండు చేతుల్లోనూ ఎత్తుకొని నిర్మానుష్యమైన ప్రదేశానికి తీసుకొని వెళ్ళి ప్రణయం తాలూకు కవిత్వమంతా ఆమెకు రహస్యంగా చెప్పాలనే పిచ్చికోర్కె నాలో కలిగింది.

ఆమెతో మాటలు కలుపుదామనే ప్రయత్నంలో వుండగా ఎవరో నా భుజంమీద తట్టారు. ఆశ్చర్యంతో వెనక్కు తిరిగి చూస్తే ఒక మామూలు మనిషి- యువకుడు కాదు, ముసలివాడు కాదు. నా వైపు విచారంగా చూస్తూ "మీతో కాస్త మాట్లాడాలి" అన్నాడు.

నేను విసుగ్గా చూశాను. అతనా సంగతి గ్రహించి అన్నాడు: "అత్యవసరమైన విషయం."

ఇక తప్పదని తేల్చుకొని, టాపుమీది అవతలి వైపుకు అతన్ని అనుసరించాను. అక్కడ అతనిలా చెప్పనారంభించాడు:

'మాన్షియర్! చలికాలం రాగానే మీ డాక్టర్ మిమ్ము హెచ్చరిస్తాడు: 'చలి బాగా ముదిరింది. మీరు చాలా జాగ్రత్తగా ఉండాలి. కాళ్ళకు చలిగాలి సోకరాదు. సాధ్యమైనంతవరకూ ఇంటిపట్టునే వుండి, వెచ్చగా ఉండేందుకు ప్రయత్నించాలి. ఈ పాడుగాలికి దగ్గూ, పడిశమూ వస్తాయి. అవి నిమోనియాకు లేదా కీళ్ళ నొప్పులకు దారి తీస్తాయి. కనుక ఆరోగ్యాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకోవటం అవసరం అని చిలక్కు చెప్పినట్లు చెప్తాడు.

'డాక్టర్ చెప్పిన ప్రకారం మీరు అనేక జాగ్రత్తలలో పడతారు. ఉన్ని దుస్తులు ధరిస్తారు. శరీరానికి ఎక్కడా చలిగాలి తగలకుండా ఫ్లానల్ గుడ్డ చుట్టుతారు. బరువైన పాదరక్షలు వేసుకుంటారు. తోలుతో తయారైన ఓవర్‌కోటు ధరిస్తారు. సాధ్యమైనంత వరకూ నిప్పుదగ్గర్నే వుండేందుకు ప్రయత్నిస్తారు. ఇన్ని మెలకువల్ని అనుసరించినప్పటికీ ఏ జలుబో చేసి రెండునెలల పాటు మంచం దిగకుండా చేస్తుంది.

'సరే చలికాలం గడిచిపోతుంది. వసంతం వస్తుంది. రకరకాల పూలూ పూస్తాయి. మధురమైన వానల్ని వెదజల్లుతూ వసంతశోభ మైమరిచేట్లు చేస్తుంది. హృదయ స్పందనమే మారుతుంది. అంతకుపూర్వం లేని అనేక పిచ్చి కోర్కెలు రేకెత్తుతాయి. అయితే వసంతాన్ని గూర్చిన హెచ్చరికల్ని మీకు ఎవ్వరూ అందించరు.

మాన్షియర్! ఈ ప్రణయాన్ని గూర్చి ముందుగానే చాలా జాగ్రత్తపడటం అత్యవసరం! ఈ ప్రణయం ప్రతిమూలలోనూ నీకోసం కాచుకొని కూర్చుంది. అది వలలు పన్ని, తన ఆయుధాల్ని పదునుపెట్టి మిమ్ము బుట్టలో వేసుకునేందుకు సిద్ధంగా వుంది. కనుక దాన్ని ఒక కంట కనిపెట్టి వుండాలి! అది జలుబుకన్న, తాగుడుకన్న, నిమోనియా కన్న కూడా ఘోరమైనది! దాని భాషలో 'క్షమ' అనే పదం లేదు. ప్రతి ఒక్కర్నీ మరి విముక్తి లేని పాపకూపంలోకి తోసెయ్యటమే దాని ఆశయం. కనుక జాగ్రత్త!' అని మీకు ఎవరైనా చెపుతారా!

'నిజం మాన్షియర్! ఈ ప్రభుత్వం ఇతర జాగ్రత్తలను ఆదేశిస్తూ రకరకాల నోటీసుల్ని వేస్తుంది. 'మలుపులో జాగ్రత్త', 'ముందు స్కూలు వున్నది. బళ్ళు మెల్లిగా పోవాలి' మొదలైన అనేక హెచ్చరికల్ని చేస్తుంది. అదేవిధంగా 'వసంతం వచ్చిపడింది. ప్రణయంలో పడిపోతారు జాగ్రత్త!' అనే హెచ్చరికను ఎందుకు చేయదు? ప్రతి గోడ మీదా, ప్రతి మలుపు మీదా ఈ హెచ్చరిక ఎంతైనా అవసరం!

'సరే ప్రభుత్వం ఆ పని చేయటం లేదు. బహుశా చేయదేమో కూడాను. కాని నా విద్యుక్తధర్మాన్ని నేను నెరవేర్చాలి కదా! కనుకనే హెచ్చరిస్తున్నాను. ప్రణయం మీ వెంట పడింది జాగ్రత్త! అది మిమ్ము ఇంతకుముందే వలలో వేసుకోవాలని ప్రయత్నించింది కనుక మిమ్ము మీరు కాపాడుకోండి."

అతని మాటలకు నేను ఆశ్చర్యపోయాను. నిలతొక్కుకొని హుందాగానే అన్నాను. "మాన్షియర్! మీకు సంబంధం లేని విషయంలో జోక్యం కలిగించుకుంటున్నట్లు కనిపిస్తోంది."

అతను హఠాత్తుగా చలించి అన్నాడు: "ఆc. మాన్షియర్! ఒక మానవుడు ప్రమాదంలో పడబోతున్నప్పుడు అతన్ని రక్షించవలసిన బాధ్యత నాకు లేదా? ఒక వ్యక్తి నదిలో మునిగిపోతున్నప్పుడు, అదిచూసి, ఈత వచ్చిన నేను అతన్ని రక్షించడం నా పని కాదని వూరుకోగలనా? సరే నా కథ వినండి. ఆ తరువాత నేనింత ధైర్యంగా మీకు ఈ సలహాను ఎందుకు చెప్పానో అర్థమౌతుంది.

"సరిగ్గా సంవత్సరం క్రితం వసంతంలో ఇది జరిగింది. అన్నిటికన్న ముందు ఈ సంగతి చెప్పనీయండి. నేను ప్రభుత్వ శాఖలో ఒకానొక సాధారణ ఉద్యోగిని. ఉన్నతోద్యోగుల అడుగులకు మడుగులొత్తుతూ, వాళ్ళకు తృప్తికరంగా వుండేట్లు గాడిదచాకిరీ చేయటం నాబోటి వాళ్ళ వంతు. తల మునిగేపనిలో వున్నప్పటికీ ఆఫీసు కిటికీలోనుంచి అప్పుడప్పుడు నీలాకాశాన్నీ స్వేచ్ఛగా, ఆనందంగా ఎగిరే పక్షుల్నీ చూస్తునే వుంటాను. ఆ సమయంలో ఆ ఫైల్స్ మధ్య నాట్యం చేయాలని నాకు అనిపించటంలో ఆశ్చర్యం లేదు.

"స్వేచ్ఛను గూర్చిన వాంఛ నాలో అధికమైంది. నా ఉన్నతాధికారి గుమస్తాలంటే ఎప్పుడూ కొరకొరలాడుతూ వుంటాడు. పొట్టిగా ఎప్పుడూ ముక్కు మీదనే కోపాన్ని ధరించి వుంటాడు. అయినప్పటికీ ధైర్యంచేసి ఎలాగైనా సెలవు సంపాయిద్దామని వెళ్ళాను.

'నాకు ఒంట్లో బాగుండలేదు' అన్నాను.

అధికారి నన్ను తేరిపార చూశాడు.

'ఆ సంగతి నేను నమ్మను' అన్నారాయన. 'సరే ఇక వెళ్ళి పనిచేసుకోవయ్యా! నీలాంటి గుమస్తాలతో పనిసాగుతుందా?'

సెలవు లేకపోగా ఈ చివాట్లు తిన్నాను. మతిపోయినట్లయి ఇలాటి రోజు ఉదయాన్నే సైనీనది మీద స్టీమర్లో బయలుదేరాను. సెయింట్ క్లౌడ్ దాకా వెళ్ళొద్దామనుకున్నాను. యీ ఒక్క రోజూ పూర్తిగా సెలవు దొరికినట్లయితే ఎంత బాగుండేది!

"సూర్యకిరణాల వేడికి నేను సాగుతున్నట్లనిపించింది. స్టీమరు నడుస్తూ, నీళ్ళలో కలిగించే శబ్దం మృదువైన సంగీతాన్ని వినిపిస్తోంది. ఒడ్డున వున్న చెట్లూ, ఇళ్ళూ మెల్లిమెల్లిగా కదిలిపోతున్నవి. ప్రకాశవంతమైన సూర్యకిరణాలు నీటి మీద పడి లోకాన్నంతటినీ వెలుగుమయం చేస్తున్నట్లనిపించింది. దేన్నన్నా- దేన్నయినా సరే ముద్దాడాలనే తీవ్రవాంఛ నాలో కలిగింది!

"అదే ప్రణయం తన వలను పన్నటం! ట్రొకడిరోలో ఒక అమ్మాయి చేతిలో చిన్న పార్శిల్‌తో వచ్చి నాకు ఎదురుగా వున్న సీటులో కూర్చుంది. ఆమె అందగత్తె కాదనే సాహసం నాకు లేదు. కాని వసంతరుతువు ఆరంభంలో స్త్రీలలో వుండే సౌందర్యం ద్విగుణీకృతంగా మనకు కనిపించడంలో అబ్బురమేమీ లేదు. అప్పుడామె అందమంతా నన్ను మత్తెక్కించిందంటే నమ్మండి. తాగినవాడి మైకానికీ, ఈ ప్రణయ మైకానికీ చాలా దగ్గరి సంబంధం వుందని నా నమ్మకం.

"నేను ఆమెవైపు తదేకంగా చూడసాగాను. ఆమె మాత్రం ఉండి ఉండి నావైపు చూడసాగింది. సరిగ్గా ఇందాక మీరు, ఆ అమ్మాయి ఒకర్నొకరు చూసుకున్నారే అలాగే! ఈ విధంగా కొంతసేపు చూపులతో పరిచయమయ్యాక ఆమె నాకు బాగా ఎరుకలో వున్న మనిషల్లే కనిపించింది. ఆమెతో మాటలు సాగించడం ఉచితమని కూడా తోచింది.

"నేను మాట్లాడాను. ఆమె జవాబు చెప్పింది. ఆమె సౌందర్యం నా దృష్టిలో మరింతగా పెరిగింది. ఆ మత్తులో తల తిరిగిపోయిందంటే నమ్మండి.

"ఆమె సెయింట్ క్లౌడ్‌లో దిగింది. నేను ఆమెను అనుసరించాను. ఆమె కొంతదూరం పోయి పార్శిల్ ఎవరికో ఇచ్చి తిరిగి వచ్చింది. ఈలోగా స్టీమర్ వెళ్ళిపోయింది. నేను ఆమె పక్కనే నడవసాగాను. గాలిలోని వెచ్చదనం, ఆనందం మా ఇద్దర్నీ నిట్టూర్చేట్లు చేసింది.

"అడివిలో చాలా బాగుంటుంది" అన్నాను నేను.

"ఔను... బాగుంటుంది!" అందామె.

"అయితే కొంచెం అటు షికారు వెళ్దామా!"

"ఆమె హఠాత్తుగా తలెత్తి నన్ను తేరిపార చూసింది. బహుశా నా రూపాన్ని పరిశీలించేందుకేమో? కొంచెం అనుమానించి, తరువాత ఒప్పుకుంది. ఒకరి పక్కగా ఒకళ్ళం నడక సాగించాం.

"పెద్ద పెద్ద చెట్లు పొడుగాటి నీడల్ని ప్రసరిస్తూన్నాయి. కాళ్ళకింద పచ్చనిగడ్డి ఎంతో మెత్తగా, వొత్తుగా, పెరిగివుంది. గడ్డిలోని పురుగులు శ్రావ్యమైన శబ్దం చేస్తూ ప్రణయగీతాలు పాడుతూన్నట్లున్నవి. చెట్ల మీది పక్షులు కూడా ఆనందంగా ఆలాపించసాగినవి. ఆమె వొళ్ళు తెలియనంత ఆనందంలో మునిగిపోయింది. చిన్నపిల్లల్లే పరుగెత్తుతూ దూకుతూ నాట్యం చేయసాగింది. నాకూ మతిపోయినట్లయి ఆమెను అనుకరించాను. ఇప్పుడు తలుచుకుంటే ఆ రోజు ఆరాధించిన మూర్ఖత్వానికి నిజంగా సిగ్గు కలుగుతుంది.

"ఆమె గొంతెత్తి ఒక వెయ్యి పాటలు పాడింది. ఆ పాటల్లోని కవిత్వం ఆ సమయంలో బాగా అర్థమైంది. కాదు నన్ను నేను మరిచేట్లు చేసింది. ఆనందబాష్పాలు

రాల్చాను. ఆ పిచ్చిపాటలు మాకు మతిని పోగొట్టినవి. నా సలహా వినండి: బాగా పాడే స్త్రీని ఎప్పుడూ పెళ్ళాడవద్దు. విశేషించి ప్రణయగీతాలు పాడే ఆమెను సాధ్యమైనంత దూరంగా ఉంచండి.

“త్వరలోనే ఆమె అలసిపోయి మెత్తని గడ్డిమీద కూలబడింది. నేనూ ఆమె పక్కనే కూర్చున్నాను. ఆమె చేతులు– మెత్తని చిన్నిచేతుల్ని నా చేతుల్లోకి తీసుకున్నాను. ఆమె చేతుల మీద సూదిగుర్తులు స్పష్టంగా ఉన్నవి. 'యీ గుర్తులు కష్టానికి యోగ్యతా పత్రాలు' అనుకున్నాను.

“మాన్షియర్! ఆ గుర్తుల అర్థం వూహించారా? అనేక మంది పనివాళ్ళ రహస్యాలోచనలూ, వాళ్ళు చెప్పుకునే రకరకాల కథల తాలూకు అసహ్యమంతా ఆ గుర్తుల్లో ఇమిడివుంది. పోయినశీలం, బాధ్యతారహితమైన సంభాషణలు! దుష్కృత్యాల కుళ్ళు, చెడు అలవాట్ల తాలూకు ప్రమాదాలు, తక్కువ తరగతి స్త్రీలలో కనిపించే కుంచిత హృదయం తాలూకు ఈర్ష్య మొదలైనవి ఆ గుర్తుల్లో ఇమిడి ఉన్నవి!

“ఆ తరువాత చాలాసేపటి వరకూ మే మిద్దరమూ ఒకరి కళ్ళలోకి ఒకళ్ళం చూసుకున్నాం. స్త్రీ కన్నుల్లో ఎంత ఆకర్షణ, ఎంత శక్తి వున్నది! ఆ శక్తి మనను ఎంత ఆందోళన పరుస్తుంది. మనకు మతిపోయినట్లయి, ఆ శక్తికి బానిసలా యెట్లు చేయగలుగుతుంది!

“ఆ చూపుల అగాధాల్లో ఎన్నెన్ని ఆశలు కనిపిస్తాయి! ఆ చూపులు బాహ్య ప్రపంచానికి సంబంధించినవి మాత్రమే కాదు, ఒకరి అంతరాత్మను వేరొకరు చూడగలిగినంత నిశితంగా ఉంటాయనిపిస్తుంది.

“కాని మాన్షియర్! అదంతా వట్టి బూటకం! మాయ! నిజంగా ఒకరి హృదయాల్లోకి, ఒకరి అంతరాత్మలోకి వేరొకరు చూడగలిగితే ఇంతింత పొరపాట్లు చేస్తామా? ఏమైనా ఆమెపట్ల అంటే విపరీతమైన ప్రేమ పెరిగింది. ఆమెను చేతుల్లోకి తీసుకోవాలని, అనుభవించాలనిపించింది.

“ఆమెను చేతుల్లోకి తీసుకోవాలని ప్రయత్నం చేశాను. కాని ఆమె దూరంగా జరిగి కూర్చుంది. దిక్కుతోచక ఆమె మ్రోల వాలాను. హృదయంలో దాగివున్న ప్రణయాన్నంతటీ్నీ వెలిబుచ్చాను. ఆనాడు ఎంత ప్రాధేయపడ్డానో ఆలోచిస్తే ఇప్పుడు నవ్వు వొస్తుంది.

“నా స్థితికి ఆమె ఆశ్చర్యపడింది. పక్కచూపుతో నా వైపు చూచి 'అయితే స్త్రీలు ఈ విధంగానే నిన్నొక మూర్ఖుణ్ణిగా తయారు చేస్తున్నారన్నమాట? సరే... చూద్దాం' అంది. మాన్షియర్ ప్రణయంలో పురుషులు కళాకారులు, స్త్రీలు వ్యాపారులు!

“ఆమె హృదయాన్ని జయించ గలననే ధైర్యం నాకు వుంది. కాని ఎంత మూర్ఖుణ్నయ్యానో తరువాత కాని తెలుసుకోలేకపోయాను. ఆమె నుంచి నాకు

కావలసింది శారీరక సౌఖ్యం కాదు. మానసికమైన ప్రణయం? నా కాలాన్ని వేరొక విధంగా సద్వినియోగం చేసే అవకాశా లన్నిటినీ జారవిడుస్తూ ఈ పాడు ఆదర్శం కోసం పాకులాడాను.

"ఎంత వాగానో, ఏమి వాగానో నేనిప్పుడు చెప్పలేను. అలాటి సమయాల్లో ప్రతి వెధవా ఒక కవి అయి కూర్చుంటాడు. అంతా విన్నాక ఆమె లేచి నిలబడింది. ఇద్దరమూ సెయింట్ క్లౌడ్‌కు వచ్చాము. పారిస్ తిరిగి వచ్చేదాకా నేనామె కొంగు పట్టుకొనే వేలాడాను. తిరిగి ప్రయాణంలో ఆమె చాలా విచారంగా వున్నట్లు కనిపించింది.

"సంగతేమిటని అడిగాను. 'జీవితంలో వచ్చే కొద్ది సుదినాల్లోనూ ఇది ఒకటి. ఈ సంగతే నేను ఆలోచిస్తున్నాను' అందామె.

"నా గుండె ఎంత వేగంగా కొట్టుకుంది. అది కాస్తా పగిలిపోతుందేమో నన్నంత భయం వేసిందంటే నమ్మండి.

'తరువాతి ఆదివారం నాడు ఆమెను మళ్ళీ కలుసుకున్నాను. ఆ తరువాతి ఆదివారం నాడు కూడాను. ఈ విధంగా ప్రతి ఆదివారమూ ఆమెను కలుసుకుంటూనే వున్నాను. ప్రణయారాధకులు వెళ్ళే దగ్గరి దగ్గరి వూళ్ళకు ఆమెను తీసుకొని వెళ్ళేవాణ్ణి. ఆ రోజు ఎంత ఆనందంగా గడిచేదని!

"ఆమె.... ఆమె నన్నెంతో గాఢంగా ప్రేమిస్తున్నట్లే నటించేది. చివరకు నన్ను నేను మరిచిపోయాను. మూడునెలలు నానా అవస్థలూ పడ్డాక ఆమెను వివాహమాడాను.

"మాన్సియర్! నేనొక సామాన్యమైన గుమాస్తాను. నాకు నా అనేవాళ్ళెవ్వరూ లేరు. నా మేలుకోరి సకాలంలో నాకు తగిన సలహాలిచ్చే మిత్రులన్నా లేరు. అలాంటి నేను పొరపాటుపడక ఏమౌతుంది? 'సంసార సుఖం' 'జీవితానందం' మొదలైన పదాలకు మనం వూహించుకొనే అర్థాలు, కనే కలలే నన్ను గోతిలోకి తోసేసినవి.

"సరే పెళ్ళయిపోయింది. పొద్దస్తమానమూ అభిప్రాయభేదాలే! ఆమె నిన్ను ఎగతాళి చేస్తుంది. ఏమేమో పిచ్చివాగుడు వాగుతుంది. నీకు తలనొప్పిగా వున్నా, ఆమె మాటలు విని ఆనందిస్తున్నట్లే నటించాలి. నీ స్థితి ఆమె అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తే కద?

"నా సంపాదనతో ఆమెకు అవసరం లేదు. ఎప్పుడూ అది లేదనీ, ఇది లేదనీ వేధిస్తూ వుంటుంది. నా శ్రమకు కనీస సానుభూతి కూడా లేదు. ఇక ఆమె లోకమే వేరు. ప్రణయగీతాలు పాడుతుంది. మండిపోయే హృదయంలో ఆజ్యం పోసినట్లే వుంటుంది! మనకు విసుగుపుట్టినా ఆ సంగతి ఆమె గ్రహించదు.

"ప్రతివాళ్ళతోనూ పోట్లాటే! పాలవాడితో తగూ వేసుకుంటుంది. ఇంట్లో పనిమనిషితో తన గృహకల్లోలాలనూ, తను అనుభవించే బాధనూ గూర్చి చర్చిస్తుంది.

పడకటింటి రహస్యాలను పక్కింటి దాసీదానితో చెపుతుంది. తన భర్త అప్రయోజకత్వాన్ని గూర్చి వ్యాపారుల్తో చెపుతూ వుంటుంది. ఆమె తలలో ఎన్ని పిచ్చి వూహలు, ఎంత ద్వేషం ఇమిడివుందో మీరు వూహించలేరు. ఇంత విషపూరితమైన వ్యక్తి ఎలా ఆకర్షించి నన్ను బుట్టలో వేసుకుందో తలుచుకుంటే ఆశ్చర్యమే కలుగుతుంది. ఆమెతో మాట్లాడినప్పుడల్లా ఒక విచార మేఘం నా మనస్సును ఆవరిస్తూనే వుంటుంది. జీవితమంటే అడుగడుగుకూ నిరాశతప్ప వేరేమీ కనిపించదు. సుఖాన బతికే ప్రాణానికి కావాలని ఉరితాడు మెడకు తగిలించుకున్నట్లయింది."

అతను ఉద్రేకంతో ఊగిపోయాడు. ఇక చెప్పలేనంత ఆయాసంతో ఆగిపోయాడనిపించింది. నాకు నిజంగానే అతనంటే ఎంతో జాలి వేసింది. పాపం! ఎంత బాధపడకుంటే ఈ అపరిచితుడి దగ్గర వ్యక్తిగతమైన జీవితఘట్టాల్ని వెళ్ళబోసుకుంటాడు? ఏదో చెప్పి అతన్ని ఊరడిద్దామనిపించింది. ఇంతలో స్టీమర్ సెయింట్ క్లాడ్ దగ్గర ఆగింది.

ఇంతకు ముందు నన్ను ఆకర్షించిన యువతి దిగిపోయేందుకు లేచి నిలబడింది. ఆమె నా పక్కనుంచే వెళ్ళింది. వెళ్తూ వెళ్తూ ఆమె పక్కచూపు చూసి, నాకే నన్నట్లుగా చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వు నాకు పిచ్చెక్కించింది. ఆ తరువాత ఆమె నది వొడ్డుకు దూకింది.

ఆమె ఆహ్వానాన్ని తిరస్కరించకుండా, ఈ అవకాశం చేయి జారకముందే త్వరపడాలనే జ్ఞానంతో ఆమెను అనుసరించేందుకు కదిలాను. నా పక్కనున్న వ్యక్తి నా భుజంమీద చేయి వేసి ఆపాడు. అతన్ని వదిలించుకోవాలని విదిలించుకున్నాను. కాని అతను నా కోటును గట్టిగా పట్టుకుని వెనక్కు లాగాడు.

"మీరు వెళ్ళకూడదు. వెళ్ళకూడదు!" అని ఉద్రేకంతో పెద్దగా అరిచాడు. స్టీమర్ మీద వున్న ఇతర ప్రయాణీకులంతా మమ్ము తేరిపార చూసి నవ్వారు. నాకేమీ తోచలేదు. కోపంతో ఊగిపోతూ ఏమీ చేయలేని స్థితిలో కదలలేకపోయాను. మరీ గోలైతే అవమానించబడతాననే భయంతో సహించి ఊరుకున్నాను. స్టీమర్ కదిలింది.

ఆమె ఒడ్డున నిలబడి తన చిలిపి కళ్ళతో ఇంకా నన్ను ఆహ్వానిస్తూనే వుంది. నా కోసమే ఆమె అక్కడ వేచి ఉన్నదని నాకు తెలుసు. కాని నిరాశతో ఆమె వైపు చూస్తూ నేను క్షణక్షణానికీ ఆమెకు దూరమౌతూనే వున్నాను. ఒక గొప్ప అవకాశం చేయి జారిపోయిందనే క్షోభ నన్ను వేధిస్తూ వుంది.

నా పక్కన వున్నతను రెండు చేతుల్నీ దులుపుకొని రహస్యంగా నాతో ఇలా అన్నాడు: "మాన్షియర్! మిమ్మొక ప్రమాదం నుంచి తప్పించాను. మీకు చాలా మేలు చేశాననే సంగతి ఒప్పుకోక తప్పదు!"